
మరునాడు రాత్రికి..

'ఏం జేస్తున్నవ్?' అని వాయిస్ మెసేజ్ పంపింది. ఆమె గొంతులో అలజడిని పసిగట్టి..

'ఏమైంది' అని అడిగాడు.

ఒక వీడియో పంపించింది. అందులో బురఖా ధరించిన ఒక యువతిని, బొట్టు పెట్టుకొని ఉన్న ఒక యువకుడు బైక్‌మీద తీసుకెళ్తుండగా కొంతమంది వెంబడించి ఆపి.. అతన్ని కొట్టి మరోసారి 'వాళ్ల' అమ్మాయిలతో తిరగొద్దని వార్నింగ్ ఇచ్చారు.



'నమస్తే తెలంగాణ, ముల్కనూరు సాహితీపీఠం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2023/24'లో రూ.5 వేల బహుమతి పొందిన కథ.

'ఇట్లాంటివి చూస్తే భయమైతదబ్బ!'.

'నువ్వెందుకు అంత టెన్షన్ పడతావు? అది జరిగింది ఇక్కడ కాదు. ఎక్కడో నార్త్‌లో! ఏదో ఎమర్జెన్సీ ఉందంటే అతను లిఫ్ట్ ఇచ్చాడని తర్వాత తెలిసింది. ఆ వీడియో వైరల్ అయ్యాక ఇక్కడ హైదరాబాద్‌లోని పెద్ద రాజకీయ నేత.. అలా చేయకండని గట్టిగా చెప్పాడు. అయినా మనకా ప్రాబ్లం లేదు కదా!'.

'హా కరక్టే! కానీ, కొంచెం భయమైంది. అయినా ఈ పొలిటీషియన్లని నమ్మొద్దబ్బ.. వాళ్ల స్వార్థం కోసం అనవ్రసంగ జనంతోని ఆడుకుంటరు'.

'ఆ వీడియో గొడవలో అసలు విషయం మర్చిపోయాను. రేపు భైంసా రావడం కుదురుతుందా?'.

అయాన్ వాళ్ల నాన్నని గల్ఫ్‌లో ఉండే ఆయన స్నేహితుడు ఒక బిజినెస్ ప్రపోజల్ మీద నిర్మల్ జిల్లాలోని భైంసాకి వెళ్లిరమ్మన్నాడు. ఈ వయసులో అంతదూరం ప్రయాణం చేయలేక.. ఆ పనిని అయాన్‌కి పురమాయించాడు. భైంసాకి ఇరవై కిలోమీటర్ల దగ్గరలోని కుబీర్‌లో ఉంటున్న తనని కలవడానికి ఇదే మంచి అవకాశంగా భావించి ఆమెని అడిగాడు.

ఆమె మనసులోనే ఎగిరి గెంతేసింది.

'అయ్యో.. ఎందుకు రాను? తప్పకుండస్త' అని పంపింది.

సమీర నాన్న ప్రభుత్వోద్యోగి కావటం వల్ల తను కూడా గవర్నమెంట్ జాబ్ సంపాదించాలని, సబ్జెక్ట్స్ మీద పట్టు పెరగడానికి ఇంటికి దగ్గరగా ఉన్న స్కూల్లో టీచర్‌గా జాయిన్ అయ్యింది. జాబ్ నోటిఫికేషన్ పడ్డాక హైదరాబాద్ వచ్చి కోచింగ్ తీసుకొని పరీక్షలు రాసి.. తిరిగి ఇంటికి వచ్చి అదే బడిలో చేరి, ఫలితాల కోసం ఎదురుచూడసాగింది.

బెడ్ మీద బోర్లా పడిపోయి..

'అసలెన్ని సార్ల కలిశినం?'.. ఎదురుగా ఉన్న నిలువుటద్దంలో తనని తాను చూసుకుంటూ ప్రశ్నించుకుంది.

'మూడు సార్లు! ఇప్పుడు కలిస్తే నాలుగోసారి. అంతేనా!?' అనుకుంది.

ఆ ఎక్స్‌ప్రెషన్ బాగా నచ్చేసి.. అతనికి మాత్రమే కనిపించేలా వాట్సప్‌లో స్టేటస్ పెట్టింది.

ఆ రీల్ చూశాడు అయాన్.

'వెన్ యు రియలైజ్ దట్ యు మెట్ హిమ్ ఓన్లీ థ్రైస్' అన్న అక్షరాలు డాన్స్ చేస్తుంటే.. ఆశ్చర్యపోతున్న మొహంతో కళ్లను కుడి ఎడమలకు తిప్పుతున్న ఆమె లేత గులాబీలా మరింత అందంగా కనిపించింది. అది చూడగానే, నవ్వుతో చిన్నవవుతున్న కళ్లను మూసుకొని ఆలోచించాడు.

'పరిచయమై ఆరు నెలలైనా, కలిసింది కేవలం.. ఓహ్.. హౌ షేమ్ ఇట్ ఈస్?' అనుకున్నాడు.

'యు నో వాట్?' ఏదో గుర్తొచ్చిన సంతోషంలో వాయిస్ మెసేజ్ పంపాడు.

'ఏంది?'.

'ఏం లేదు. కలిసాక చెప్తా!'.

ఒకరినొకరు ఇష్టపడ్డారన్న విషయం కూడా ఎరుకలోకి రాకుండానే వారి మనసులు అలా సర్దుకున్నాయి. ఇంతవరకు ప్రపోజ్ చేసుకోలేదు కాబట్టి అతనేం చెప్తాడోనని ఊహించగానే ఆమె బుగ్గలు ఎరుపెక్కాయి.

* * *

అయాన్ తల్లిదండ్రులది శ్రీకాకుళం దగ్గర ఒక చిన్న ఊరు. కరువుకు తాళలేక అతను పుట్టకముందే హైదరాబాద్‌కు వలస వచ్చారు. అతను పుట్టిన మూడేళ్ల వరకు ఇక్కడే ఉన్నాడు. చెల్లి పుట్టగానే అతన్ని అమ్మమ్మ వాళ్లింటికి పంపించారు. సెలవుల్లో వచ్చి పోతూ పది వరకు అక్కడే చదువుకొని, తర్వాత ఇక్కడికి వచ్చి ఇంటర్ నుంచి పీజీ వరకు పూర్తి చేశాడు. అక్కడి స్థానికత ఉండటంతో ప్రభుత్వ సంబంధిత పరీక్షలకు వెళ్లి రాసి వచ్చేవాడు.

'యు నో వన్ మోర్ థింగ్? మనం మొదటిసారి శుక్రవారం రోజు కలుసుకుంటున్నాం!' అని పంపాడు.

'అవునా?'.

'నీకు శుక్రవారం బాగా ఇష్టం అనుకుంటా?'.

'హా.. నీకేమన్న తక్కువనా? అసలే మీకు బిజినెస్ ఉంది కదా! మీక్కొంచెం ఎక్కువనే ఇష్టముంటది!'.

అబ్బాయి నాన్నకు ఫుట్‌వేర్ షాపుంది. చిన్నప్పటి నుంచీ నాన్న ఒడుదొడుకుల్ని చూస్తున్న అతనికి.. ప్రభుత్వరంగ ఉద్యోగం ఉంటేనే భద్రత అని నమ్మి ప్రయత్నిస్తున్నాడు.

'ఆరోజు ఇద్దరం ట్రెడిషనల్‌గా తయారై కలుద్దామా?'.

ఆ ఐడియా అమ్మాయికి బాగా నచ్చింది. పైగా మళ్లీ ఎప్పుడు కలుస్తారో తెలియదు కాబట్టి..

'సరే!' అని మెసేజ్ చేసింది.

* * *

ఆమె పొద్దున్నే లేచింది. చిలకపచ్చ రంగు పట్టుశారీ కట్టింది. లిప్ లైనర్‌తో బార్డర్ వేసింది. ముందే చెప్పడంతో ఇద్దరు స్నేహితురాళ్లు ఇంటికి వచ్చారు.

''భైంసాల చిన్న ఫంక్షన్ ఉంది. పోయస్తం!'' అని ఇంట్లో చెప్పింది.

''ఎందుకు బిడ్డా అనవసరంగా?'' అన్నది సమీర అమ్మ కాస్త భయపడుతూ!

''ఇట్ల భయపడితె ఎట్లమ్మ? అట్లనే గోపాల్‌కృష్ణ మందిర్‌కి పోక మస్తు రోజులాయె. జల్ది అచ్చేస్తం!''.

''లేట్ జేస్కోకుండ్రి మల్ల..'' అన్నది అమ్మ.

* * *

భైంసా మార్కెట్ దగ్గర దిగగానే అక్కడ కనిపించిన తునికిపండ్లు తీసుకుంది.. అబ్బాయికి రుచి చూపిద్దామని. ఆ ఊళ్లో మాత్రమే తయారయ్యే 'కలామ్' స్వీట్‌ను కూడా ప్యాక్ చేయించింది.

గుడికి వెళ్లి దర్శనం చేసుకొని, అక్కడే కిసాన్ గల్లీలో ఉన్న ఒక బేకరీలో కూర్చున్నారు. టెన్షన్ టెన్షన్‌గా అటూ ఇటూ చూస్తూ అన్నీ గమనిస్తూ ఉన్నారు. మూడు నెలల క్రితం మొదలైన గొడవల వల్ల ఆ ఏరియా సమస్యాత్మక ప్రాంతంగా మారింది. కానీ, అక్కడ కలుసుకోవడం ఒక రకంగా 'సేఫ్' అని రమ్మంది. ఇప్పుడంతా సర్దుకుంది కానీ.. ఎప్పుడు ఏ క్షణంలో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం కాదు. అతను తొందరగా వస్తే కాసేపుండి గుడికి తీసుకెళ్లాలని ఎదురుచూస్తూ కూర్చుంది.

మొహంలో తెలియని నవ్వు, మనసులో కనిపించని ఆత్రం తగ్గక ముందే.. వెనుక నుంచి వచ్చి..

''హాయ్'' అన్నాడు. వెనక్కి తిరిగి చూసింది సమీర.

ట్రిమ్ చేసి ఉన్న సన్నని గడ్డం మీసాలు, నల్లని జుట్టును కప్పి ఉంచిన తెల్లటి టోపి, కళ్ల కింద సుర్మా, తెల్లటి లాల్చీ పైజామాలో.. మరింత రంగు తేలిన అయాన్ను చూస్తూ..

'ఓళ్లీళ్లు? యాడ్నో సూశినట్టుంది?' అనుకున్నది.

''సమీరా! నేను..'' అంటూ.. నుదుటన కుంకుమతో, దాని కింద చిన్న స్టిక్కర్‌తో, వీరబూసిన జుట్టును చిన్న క్లిప్‌తో జతచేసిన ఆమెని చూసి ఆశ్చర్యపోయాడు.

మూడు రోజులు నీళ్లు పోయకుంటే వాడిపోయిన రోజాలా..

''అయాన్.. నువ్వేనా? ఇట్లున్నవేంది?'' అన్నది.